పెద్ద ఎక్లరాలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

- సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా పండుగ వేడుకలు



మద్నూర్ / అక్టోబర్ 17 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్ద ఎక్లరా గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి,సంప్రదాయ పద్ధతిలో వేడుకలను నిర్వహించారు.బతుకమ్మ పాటలు, ఆటలతో పండుగ సందడి నెలకొంది. మహిళలుసంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటూ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పారు. గ్రామీణ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు తెలంగాణ పండుగల విశిష్టతను తెలియజేయడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని స్థానికులు పేర్కొన్నారు.సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలు గ్రామంలో పండుగ శోభను నింపాయి. గ్రామ ప్రజలు, మహిళలు సంప్రదాయ పండుగను ఆనందంగా జరుపుకుంటూ బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములయ్యారు.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ పెద్ద ఎక్లరా గ్రామంలో బతుకమ్మ సంబురాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం లో దేశాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయపట్నం గ్రామంలో జాతీయ పత్తి ఉత్పాదకత మిషన్‌పై.. రైతులకు శిక్షణ మరియు యాసంగి సాగుపై అవగాహన..



ఖమ్మం/ మధిర అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)
మధిర మండలం రాయపట్నం గ్రామంలో జాతీయ పత్తి ఉత్పాదకత మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ రైతులకు పత్తి పంటలో ఆధునిక సాగు పద్ధతులు, ఉత్పాదకత పెంపు, సమగ్ర సస్యరక్షణ మరియు యాసంగి పంటల సాగుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పత్తి సాగు ఈ విధానంలో పత్తిని 90 ఐ 15 సెం.మీ. దూరంతో సాగు చేయడం ద్వారా నిర్ణీత విస్తీర్ణంలో మొక్కల సంఖ్యను పెంచవచ్చని మండల వ్యవసాయ అధికారి వివరించారు. మొక్కల ఎత్తు, పెరుగుదలను నియంత్రించేందుకు పంట దశను బట్టి 40 మరియు 60 రోజుల సమయంలో వ్యవసాయ శాఖ సిఫార్సుల మేరకు వృద్ధి నియంత్రకాల వినియోగం గురించి వివరించారు. పంటను ఒకేసారి కోతకు అనుకూలంగా నిర్వహించడం ద్వారా కోత ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు యాసంగి సాగుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగును నీటి లభ్యతకు అనుగుణంగా పరిమితం చేసుకొని, తక్కువ నీటితో పండించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.రైతులు తమ భూముల స్వభావం, అందుబాటులో ఉన్న నీటి వనరులు మరియు స్థానిక వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని శనగ, పెసర, మినుము వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను అనుకూలతను బట్టి సాగు చేయాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ సాగు ఖర్చులను తగ్గించుకోవాలని, పంటల ఎంపికలో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపి, ఆత్మ డైరెక్టర్ గోపాల్ రావు, మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ గురుమూర్తి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో కులవివక్షపై చర్యలు తీసుకోవాలి..

- దళిత మహిళలకు న్యాయం చేయాలి..
- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ అక్టోబర్ 17/అక్షరం న్యూస్:- యాదాద్రి భువనగిరి జిల్లా టి.రేపాక గ్రామంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా దళిత మహిళల పట్ల కులవివక్షకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శనివారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని మహిళల ఐక్యతను చాటే ఈ పండుగలో దళిత మహిళల పట్ల వివక్ష చూపడం బాధాకరమని అన్నారు. పండుగ వేళ పిల్లాపాపలతో సంతోషంగా బతుకమ్మ ఆడుకోవాల్సిన మహిళలను కులం పేరుతో అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళిత మహిళలకు ఆత్మగౌరవం లేదా? అని నిలదీశారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం...

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధించిందని ప్రకాష్ గుర్తుచేశారు. కులవివక్షకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బతుకమ్మ అందరి పండుగ అని ఇలాంటి వేడుకల్లో కులవివక్ష తాండవం కాడదని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాలే తప్ప కులాలు, మతాల పేరుతో విభజనకు కారణం కాకూడదన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

టి.రేపాక గ్రామంలో జరిగిన ఘటనపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి బాధిత దళిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విచారణలో కులవివక్షకు పాల్పడినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని కోరారు.స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా సమాజంలో కులవివక్ష కొనసాగడం ఆందోళనకరమని అన్నారు. రిజర్వేషన్లు అమల్లో ఉన్నప్పటికీ దళితులు వివక్ష దాడులు తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన



వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను తొలగించాలని కొందరు మాట్లాడుతున్న నేపథ్యంలో రిజర్వేషన్లు లేని పరిస్థితుల్లో దళిత బహుజన వర్గాల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని సూచించారు. కులవివక్ష లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం తరఫున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తందూరు ఎల్లయ్య, బహుజన్ రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, కట్కూర్ గ్రామ సర్పంచ్ ముంజ బాలరాజు, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక బతుకమ్మ సంబరాలెలా?

- ఆదేశాలు ఘనం.. నిధుల విడుదల శూన్యమా?
- ఓదెల మండలంలో బతుకమ్మ నిర్వహణకు కార్యదర్శుల పాట్లు!

పెద్దపల్లి ఓదెల అక్టోబర్ 17 అక్షరం న్యూస్
ఓదెల: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఓదెల మండలంలో బతుకమ్మ వేడుకల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో ఏర్పాట్లు ఎలా చేయాలన్న సందిగ్ధంలో కార్యదర్శులు సర్పంచులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆదేశాలు ఇచ్చారు.. ఖర్చుల సంగతేంటి?

బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలంటే పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, ఇతర అవసరమైన ఏర్పాట్లకు ఖర్చులు తప్పనిసరి. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొల్పాలని అధికారుల నుంచి ఆదేశాలు వస్తున్నప్పటికీ, అందుకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలనే ప్రశ్న కార్యదర్శులను సర్పంచులను వేధిస్తోంది.

ప్రభుత్వం పండుగకు ప్రాధాన్యం ఇస్తున్నప్పుడు.. క్షేత్రస్థాయి సిబ్బందికి భరోసా ఏది?

రాష్ట్రస్థాయిలో బతుకమ్మ వేడుకల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటనలు వెలువడుతున్న తరుణంలో, గ్రామస్థాయిలో పండుగ నిర్వహణకు అవసరమైన నిధుల కేటాయింపు, విడుదలపై స్పష్టత ఉండాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్రస్థాయి వేడుకలకు నిధులు కేటాయించడం ఒక ఎత్తయితే, ప్రతి గ్రామంలో పండుగను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడం మరో ఎత్తు.

జేబుల నుంచి ఖర్చు చేయాలా?

గ్రామస్థాయిలో ఏ కార్యక్రమం నిర్వహించినా బాధ్యతలు మాత్రం కార్యదర్శులపైనే పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిధులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఒత్తిడి వస్తే ఖర్చులు ఎవరు భరించాలనే ప్రశ్న తలెత్తుతోంది. నిధుల కేటాయింపులో స్పష్టత లేకుండా క్షేత్రస్థాయి సిబ్బందిపై బాధ్యతలు మోపడం ఎంతవరకు సమంజసమనే చర్చ సాగుతోంది.

అధికారులు స్పందించాలి.. నిధులపై స్పష్టత ఇవ్వాలి!



ఓదెల మండలంలోని గ్రామపంచాయతీలకు బతుకమ్మ వేడుకల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఎంత బడ్జెట్ కేటాయించారు? నిధులు ఎప్పుడు విడుదల చేస్తారు? ఖర్చులకు మార్గదర్శకాలు ఏమిటి? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. పండుగ ముగిసిన తర్వాత బిల్లుల కోసం కార్యదర్శులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా ముందుగానే నిధులు అందించాలని స్థానికులు కోరుతున్నారు.సంస్కృతి పండుగను ఘనంగా నిర్వహించాలనే సంకల్పం మంచిదే.. కానీ ఆ సంకల్పానికి తగిన ఆర్థిక సహకారం కూడా ఉండాలి. ఆదేశాలతోనే పండుగలు జరగవు.. నిధులు విడుదలైనప్పుడే ఏర్పాట్లు సాధ్యమవుతాయి! అని కొంతమంది కార్యదర్శులు మదన పడుతున్నట్లు తెలిసింది.

చీకటి కాలనీల్లో వెలుగులు

- స్థానిక సర్పంచ్ మాచర్ల కుమారస్వామి..
- బస్టాండ్ వద్ద ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు...



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ అక్టోబర్ 17/అక్షరం న్యూస్:- భీమదేవరపల్లి
మండల కేంద్రంలోని కొన్ని కాలనీల్లో కొన్నేళ్లుగా నెలకొన్న చీకట్లను తొలగించేందుకు వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు తరలించారు. ఈ పనులను సర్పంచ్ మాచర్ల కుమారస్వామి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు అమర్చడంతో స్థానికులకు చీకటి సమస్య నుంచి ఉపశమనం లభించనుంది. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించడంతో ప్రమాదాల ముప్పు తగ్గనుంది. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఏఈ లక్ష్మణ్ నాయక్, లైన్ మెన్ బాలరాజు, ఉపసర్పంచ్ ఐలయ్య, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల గ్రామ పంచాయతీ ఆవరణ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు ఓదెల లోగో ఆవిష్కరణ



పెద్దపల్లి ఓదెల అక్టోబర్ 17 అక్షరం న్యూస్
ఓదెల గ్రామ పంచాయతీ ఆవరణ లో శుక్రవారం సాయంత్రం సర్పంచ్ డాక్టర్ కనికిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా. పాలకవర్గం సభ్యులు మరియు గ్రామ స్థాయి మహిళా ఉద్యోగులు అంగన్వాడీ,ఆశా కార్యకర్తలు,మహిళా సంఘాల సీఏ లు పాల్గొని బతుకమ్మ ను పేర్చి ఆట పాటలతో ఆనందోత్సవాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకుంటారు.అనంతరం మహిళలకు సరదాగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు .సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ చేతుల మీదుగా పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ ముందు ఉన్న ఐ ?? ఓదెల బోర్డు ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ కనికిరెడ్డి సతీష్ కార్యదర్శి వెంకట లక్ష్మణ్ ఉప సర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్ వార్డ్ సభ్యులు చింతం విజయ స్వామి, పెండం లక్ష్మీ ఓదెలు, బుద్ధ తిరుమల రవి, తోట ఉమా మహేశ్వరి,సిరిగిరి ఎల్లక్క రాజారాం,గొర్ల శ్రీనివాస్,ముద్దసాని కిరణ్ చింతం తిరుపతి, రాచర్ల అశోక్, కొండ్ర లక్ష్మణ్,రాపెల్లి రాజయ్య,దూలం సదానందం అంగన్వాడీ లు,ఆశాలు,మహిళా సంఘాల సీఏ లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యుత్ సంక్షోభం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బన్సీ పటేల్

మద్నూర్ / అక్టోబర్ 17 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

మద్నూర్ మండలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులకు, గృహ వినియోగదారులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ సమరభేరి మోగించింది. రాష్ట్రంలో తరచూ విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ రంగంపై విద్యుత్ సమస్యలు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు బన్సీ పటేల్ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ సరఫరాపై అనిశ్చితి నెలకొందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తమ వ్యవసాయ పనులను సకాలంలో నిర్వహించలేకపోతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలకు అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామని ప్రకటించడం కంటే, సమస్యకు అసలు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్లే విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బన్సీ పటేల్ ఆరోపించారు.

విద్యుత్ కోతలతో రైతులకు తీవ్ర నష్టం

విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల వ్యవసాయ మోటార్లు దెబ్బతింటున్నాయని, పంటలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు నష్టపోతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రైతులు సబ్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో, వరి సాగు చేయవద్దంటూ ప్రభుత్వం సూచనలు చేయడం రైతులకు ఇబ్బందికరంగా మారిందని విమర్శించారు. రైతులకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళనలు

మద్నూర్ మండల పరిధిలోని రైతులకు, గృహ వినియోగదారులకు తక్షణమే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని బన్సీ పటేల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలను



వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడి, భారీ ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల పాల్గొనడం

ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాశీనాథ్ పటేల్, మాజీ సొసైటీ చైర్మన్ పండిత్ రావు పటేల్, మండల మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు దారస్ సురేష్, చిన్న శక్కర్గ మాజీ సర్పంచ్ గఫర్, షాకాపూర్ మాజీ సర్పంచ్ సభ్యుడు ఎం.కే. పటేల్, మండల బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ కాలే, రూసేగావ్ గ్రామ ఉపసర్పంచ్ సభ్యుడు, మద్నూర్ మండల ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మహేష్, మండల యువ నాయకుడు వాగుమారే మారుతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలతో రైతన్నలు బేజారు!



మద్నూర్ / అక్టోబర్ 17 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విధిస్తున్న విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డోంగ్లీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాజు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల సమస్యపై ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా రాజు పటేల్ మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేశారని గుర్తుచేశారు. నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో రైతులు తమ పంటలకు సకాలంలో నీరు అందించుకునే అవకాశం కలిగిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఎండుతున్న పంటలు!

ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలనలో తరచూ విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రాజు పటేల్ ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు సక్రమంగా నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం విద్యుత్ కోతలు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

24 గంటల విద్యుత్ అందించాలి

రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రాజు పటేల్ డిమాండ్ చేశారు. వ్యవసాయానికి, గృహ వినియోగదారులకు 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసి రైతులను, ప్రజలను ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని కోరారు.విద్యుత్ కోతల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని రాజు పటేల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో డోంగ్లీ మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న మహిళలు..

- ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం
- 200 మందికి పరీక్షలు..



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

వైరా నియోజకవర్గ కేంద్రంలోని కమ్మవారి కల్యాణ మండపంలో కమ్మ జన సేవా సమితి కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్గూడూరిసత్యనారాయణ కమ్మ జన సేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ వారు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారుక్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు స్థానిక ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరానికి వందలాదిమంది ప్రజలు హాజరై వైద్య చికిత్సలు పొందారు. క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని . శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించాలని తెలిపారు .క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు, అదేవిధంగా ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారుఈకార్యక్రమంలో అమ్మ జన సేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జున రావు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాప చంద్రకళ సుడా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాప చంద్రకళమురళీకృష్ణ ఎస్సై పుష్పాల రామారావు కమ్మ జన సేవా సమితి సభ్యులు చింతనిప్పురాంబాబు ,మెదరమెట్ల శ్రీనివాసరావు ,చావా శ్రీనివాసరావు ,సూర్యదేవర శ్రీధర్, వాసిరెడ్డి రమేష్ ,ఏనుగు హనుమంతరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనకు విస్తృత చర్యలు...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- పటిష్ట నిఘా పెట్టాలి...
- శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- మాదక ద్రవ్యాల నిర్మూలనపై అధికారితో సమీక్షించిన జిల్లా కలెక్టర్..

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం, విక్రయాలను అరికట్టడానికి పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్, వైద్య-ఆరోగ్య, విద్య శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఎన్‌కార్డ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా జిల్లాలోని పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంతో చదువులో వెనుకబడి, భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. మత్తు కోసం డబ్బుకోసం నేరాలకు, దొంగతనాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, కుటుంబాల్లో గొడవలు, మానసిక ఒత్తిడి, బంధాలు దెబ్బతింటాయని అన్నారు. మంచి సమాజం కొరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 55 గంజాయి/డ్రగ్స్ కేసులు నమోదు చేయగా, 137 మంది నిందితులను అరెస్టు చేశారన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు మార్గాలు, జిల్లాలోని అంతర్రాష్ట్ర రవాణా మార్గాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కేసులలో మూలాలు, సరఫరాదారులు, కొనుగోలుదారులను పూర్తి స్థాయిలో గుర్తించి, ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల వద్ద ప్రత్యేక పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. స్కూల్స్ వద్ద చాక్లెట్ల అమ్మకాలపై నిఘా పెట్టాలని, తరచు దాడులు నిర్వహించాలని అన్నారు.విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జిల్లాలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇప్పటివరకు 57 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ-డ్రగ్ క్లబ్‌ల ఏర్పాటు, నిర్వహణను నిర్బంధం చేయాలన్నారు. కళాశాలల నుండి హై స్కూల్ ల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సెలింగ్, వైద్య చికిత్స, పునరావాసం కల్పించేందుకు జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక డీ-అడిక్షన్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా షెడ్యూల్డ్ మత్తు బిళ్ళలు, ప్రిస్క్రిప్షన్ మందులు విక్రయించే మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు, తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. గంజాయి లేదా ఇతర



మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1908 కి సమాచారం అందించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం. ఫిరంగి, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర రావు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు దేవేందర్ రెడ్డి, అనిల్, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జి. వీరన్న, పోలీస్ ఇన్స్పెక్టర్ వి. విజయ రాంకుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంగారాం పటేల్ ప్రథమ పుణ్యతిథి సందర్భంగా పూజలు

- ఖాతాగావ్ పీఠాధిపతి శ్రీ 108 మల్లికార్జున్ శివాచార్య స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

మద్నూర్ / అక్టోబర్ 17 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మెనూర్ గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్ తండ్రి, దివంగత జాంషెట్ వార్ గంగారాం పటేల్ ప్రథమ పుణ్యతిథి కార్యక్రమాన్ని శనివారం కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఖాతాగావ్ పీఠాధిపతి శ్రీ 108 మల్లికార్జున్ శివాచార్య స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఖాతాగావ్ పీఠాధిపతి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు

ప్రథమ పుణ్యతిథి కార్యక్రమానికి ఖాతాగావ్ పీఠాధిపతి శ్రీ 108 మల్లికార్జున్ శివాచార్య స్వామిజీ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైదిక సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం మెనూర్ గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్ కుటుంబ సభ్యులు శ్రీ 108 మల్లికార్జున్ శివాచార్య స్వామిజీతో పాటు అంజప్ప మహారాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. గురువుల రాకతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా దివంగత గంగారాం పటేల్ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



భక్తులకు అన్నప్రసాద వితరణ

పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమంతో మెనూర్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో శ్రీ 108 మల్లికార్జున్ శివాచార్య స్వామిజీ, అంజప్ప మహారాజ్, మెనూర్ గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్, జాంషెట్ వార్ బస్వంత్ పటేల్, విట్టల్ రావు, నాగనాథ్ పటేల్, యాదరావు సార్, మన్మథ్, గంగారాం పటేల్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్యసేవలు అందించడమే లక్ష్యం..

- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు**



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్) రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రమాద మరణాలను తగ్గించడం, బాధితులకు సకాలంలో నాణ్యమైన అత్యవసర వైద్యసేవలు అందించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు సూచించారు.ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడటంలో ప్రతి ఆసుపత్రి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పథకాల అమలుపై సూచనలు చేశారు.ప్రమాద వివరాల నమోదు: రోడ్డు ప్రమాద బాధితుల వివరాలు, గాయాల తీవ్రత, ఆసుపత్రిలో చేరిన సమయం తదితర సమాచారాన్ని సంబంధిత అంతర్జాల వేదికలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయంతో సమాచారాన్ని నమోదు చేసి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సహకరించాలి.నగదు రహిత అత్యవసర వైద్య చికిత్స: ప్రధానమంత్రి రహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అత్యవసర చికిత్స నిలిచిపోకుండా, అర్హత నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. ఆసుపత్రులు సంబంధిత అంతర్జాల ప్రవేశ సదుపాయాలను తనిఖీ చేసి, బాధితుల గుర్తింపు సంఖ్యలను, చికిత్స నమోదు సంఖ్యలను అనుసంధానం చేస్తూ నిర్ణీత గడువులోగా వైద్య ఖర్చుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలి.రహ–వీర్ పథకం: రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంటలోపు బాధితులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు సహకరించే మంచి మనసున్న వ్యక్తులకు నిబంధనల ప్రకారం రూ. 25,000 నగదు ప్రోత్సాహకం అందించే పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. అర్హులైన వ్యక్తుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, వారి ధ్రువీకరణ ప్రక్రియలో సంబంధిత అధికారులకు సహకరించాలని ఆసుపత్రి యాజమాన్యాలకు సూచించారు.ప్రతి ఆసుపత్రి ఒక బాధ్యతాయుత అధికారిని నియమించుకుని, పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని డా. రామారావు ఆదేశించారు. ఈ పథకాల అమలును కేవలం నమోదు ప్రక్రియగా కాకుండా, విలువైన ప్రాణాలను కాపాడే సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. అన్ని ఆసుపత్రులు సమన్వయంతో పనిచేసి ఖమ్మం జిల్లాను రోడ్డు ప్రమాద మరణాలు తగ్గిన ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, ప్రాజెక్టు నిర్వాహకుడు హరిబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డా. పి. సతీష్, ఆరోగ్యశ్రీ జిల్లా నిర్వాహకుడు పి. శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ బృంద నాయకుడు బి. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులలో అక్రమాలు, సిఎంఆర్ బియ్యం బకాయిలపై పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు.. జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్..

- **బియ్యం త్వరగా డెలివరీ చేయాలని మిల్లుల యజమానులకు ఆదేశం..**
- **నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు..**

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

రైస్ మిల్లులలో అక్రమాలు, సిఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ (పౌరసరఫరాలు) ఆదేశాల మేరకు జిల్లాలోని పలు రైస్ మిల్లులపై విస్తృత తనిఖీలు చేపట్టినట్లు అన్నారు.నేలకొండపల్లి మండలంలోని రైస్ మిల్లులపై ఇటీవల వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా దుర్గాభవాని రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు, తనిఖీల్లో సీఎంఆర్ డెలివరీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే స్పందించి, నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని పూర్తిస్థాయిలో డెలివరీ చేయాలని మిల్లు యజమానిని కఠినంగా ఆదేశించామన్నారు. ఆదేశాలను పాటించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు.గత రెండు నెలల కాలంలో జిల్లాలోని 15 రైస్ మిల్లులపై విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారులు దాడులు నిర్వహించారని, ఈ దాడుల్లో గుర్తించిన ధాన్యం కొరతకు సంబంధించి ఆయా మిల్లర్లకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి తెలిపారు. విజిలెన్స్ తనిఖీల ఆధారంగా మిల్లర్లు మొత్తం రూ. 64.63 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 47.81 కోట్లు రికవరీ చేయడం జరిగిందని అన్నారు. మిగిలిన బాకీ పడిన మొత్తాన్ని చెల్లించని ఇద్దరు మిల్లర్లకు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో, నిబంధనల ప్రకారం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సాధారణ క్షేత్రస్థాయి తనిఖీలలో స్టాక్ కొరత ఉన్నట్లు తేలడంతో మరో 3 మిల్లులపై నోటీసుల అనంతరం క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వారం బుధవారం రోజున పౌరసరఫరాల కమిషనర్ పివియాప్ గ్రాష్ట్రఎంఅఘిశ్రీ ఎవతీఅటఅఘిఫ్అశీఅ ూజూజూ) ద్వారా జిల్లాలోని రైస్ మిల్లులలో భౌతిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ తనిఖీల విశ్వసనీయత కోసం కమిషనర్ కార్యాలయ ప్రత్యేక బృందం ద్వారా సూపర్ చెక్ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో స్టాక్ వ్యత్యాసాలు లేదా కొరత ఉన్నట్లు తేలితే సదరు మిల్లులపై కఠిన చర్యలు ఉంటాయని పౌరసరఫరాల అధికారి ఆ ప్రకటనలో హెచ్చరించారు.

విద్యుత్ ప్రమాదాలకు చెక్!

- **కొప్పూరు ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ లైన్లు..**
- **నూతన లైన్‌ను ప్రారంభించిన ఏఈ లక్ష్మీనాయక్.. విద్యుత్ సిబ్బందికి సన్మానం..**



హనుమకొండ జిల్లా/

భీమదేవరపల్లి/ అక్టోబర్ 17/అక్షరం న్యూస్:- హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామ ప్రధాన రహదారిపై విద్యుత్ ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రహదారికి ఇరువైపులా నూతన విద్యుత్ స్తంభాలు, లైన్లను ఏర్పాటు చేశారు. శనివారం విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనాయక్ కొబ్బరికాయ కొట్టి నూతన విద్యుత్ లైన్‌ను ప్రారంభించారు.

వాహనదారులకు తప్పనున్న ఇబ్బందులు..

గతంలో ప్రధాన రహదారికి ఒకవైపే విద్యుత్ స్తంభాలు, వైర్లు ఉండటంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా లారీలు, ఇతర భారీ వాహనాలు వెళ్లేటప్పుడు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండేది. అంతేకాకుండా రహదారికి అవతలివైపు ఉన్న ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించడంలోనూ సమస్యలు తలెత్తేవి. ఈ సమస్యను స్థానిక సర్పంచి గద్ద కుమారస్వామి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేయడంతో గృహాలకు విద్యుత్ సరఫరా సులభతరం కానుంది. అలాగే వాహనదారులకు ఇబ్బందులు తగ్గడంతోపాటు విద్యుత్ ప్రమాదాల ముప్పు కూడా తగ్గనుంది.

విద్యుత్ సిబ్బందికి సన్మానం..

నూతన విద్యుత్ లైన్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనాయక్, లైన్‌మెన్ బాలరాజు, అసిస్టెంట్ లైన్‌మెన్‌లను శాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాణి రాజు, వార్డు సభ్యుడు సంగేం శ్రీనివాస్, గ్రామస్తులు రచ్చ సంపత్, కొత్తకొండ నాగరాజు, జనగాని సమ్మయ్య, గద్ద సారయ్య, రాజమౌళి, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

కేశ్వాపురం గ్రామంలో శ్రీ సీతారామ అభయంజన స్వామి వారి దేవాలయం నందు బతుకమ్మ ఉత్సవాలు

- **బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న**
- **కేశవాపురం గ్రామ ఉప సర్పంచ్ సాదం. రమేష్**



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామంలో

బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటున్నారు.ఈ బతుకమ్మ ఉత్సవాలలో కేశవాపురం గ్రామ ఉపసర్పంచ్ సాదం రమేష్ పాల్గొని మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరు ఆనందంగా ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషకరమైన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేశవాపురం గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ పై ప్రమాదం

- **ఇద్దరు మృతి నలుగురి కి గాయాలు..**



ఖమ్మం/ వైరా అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

వైరా మండలం సోమవరం గ్రామం గ్రీన్ఫీల్డ్ హైవే ఎగ్జిట్ సమీపంలో. అర్ధరాత్రి సమయంలో బొలెరో వాహనాన్ని వెనకనుంచి లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ప్రమాదంలో నలుగురువ్యక్తులకుగాయాలయ్యాయి బొలెరో వాహనం దేవరపల్లి నుండి భువనగిరి వెళ్తుండగా వైరా మండలం సోమవరం గ్రామం గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ సమీపంలో బొలెరో వాహనాన్ని వెనకనుంచి వస్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టింది బొలెరో వాహనం పల్టీ కొట్టడంతో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న. మల్లేష్ ఉపేందర్ అనే వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు ప్రమాదంలో మరో నలుగురూ వ్యక్తులకు గాయాలయ్యాయి సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై వైరా ఎస్సై పి రామారావు కేసు నమోదు చేశారు.

అన్నారుగూడెం గ్రామంలో మహా అన్నదానాన్ని ప్రారంభించిన ఇండస్ట్రియల్ మాజీ చైర్మన్ ముప్వా విజయబాబు..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో రామాలయం వద్ద గురుస్వామి గోవిందు శ్రీనివాసరావు(ట్రాక్టర్), గోవిందు సురేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ మాజీ చైర్మన్ ముప్వా విజయబాబు ప్రారంభించారు. తొలుత ఆయనకు సీనియర్ నాయకులు, గ్రామ ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ) సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయనను గురు స్వాములు శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావులను ఆయన శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కూచిపూడి వెంకటేశ్వరావు, పొన్నం కృష్ణయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకుబ్ పాషా, గోవిందు నరసింహారావు, తాళ్లూరి ఆది నారాయణ, కందుల నారాయణ, కొత్తపల్లి దానయ్య, పిన్ని హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో 281వ నేత్రదానం

- **మరొకరి జీవితాల్లో వెలుగులు నింపిన పోలోజు నాగమణి**



పెద్దపల్లి ఓదెల, అక్టోబర్ 17: అక్షరం న్యూస్

మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలనే గొప్ప ఆశయంతో ఓదెల గ్రామంలో నేత్రదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఓదెల గ్రామానికి చెందిన పోలోజు నాగమణి నేత్రదానం చేయడంతో గ్రామంలో 281వ నేత్రదానం పూర్తయింది. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మాచారి మరియు ఓదెల గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు.నేత్రదానం ద్వారా అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ప్రసాదించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపవచ్చని ఆయన పేర్కొన్నారు. మరణం సహజమైనదే అయినప్పటికీ, మరణానంతరం కూడా మరొకరికి చూపునిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపడం ఎంతో గొప్ప మానవతా కార్యమని అన్నారు.నాగమణి నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు అన్న వదిన పోలోజు రమేష్, పద్మ, అల్లుడు రాకేష్, మౌనిక, కుటుంబ సభ్యులు ముత్తూజు, భవాని, రమేష్‌లను ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ క్యాతం మల్లేశంఅభినందించారు. కుటుంబ సభ్యుల సహకారం, సామాజిక బాధ్యత పట్ల వారి నిబద్ధత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఓదెల గ్రామంలో ఇప్పటివరకు 281 నేత్రదానాలు జరగడం గ్రామ ప్రజల మానవతా దృక్పథానికి, సేవాభావానికి నిదర్శనమని మెరుగు భీష్మాచారి తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మ చారి తో పాటు తదితరులు పాల్గొన్నారు

పిఆర్టియు రాష్ట్ర కార్యదర్శిగా నిమ్మతోట జాన్

- పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పాటి రామచంద్రయ్య ..



ఖమ్మం/ వైరా అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

నల్గొండలో జరిగిన పిఆర్టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో వైరా మండలం గొల్లపూడి పాఠశాలలో పనిచేస్తున్న నిమ్మతోట.జాన్ రాష్ట్ర కార్యదర్శిగా,, తాటిపూడి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పాటి రామచంద్రయ్య పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ పాటి రామచంద్రయ్య వైరా మండల శాఖకు రెండు దశాబ్దాలకు పైగా మండల ప్రధాన కార్యదర్శిగా, ఎనిమిది సంవత్సరాలు జిల్లా కార్యదర్శిగా ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావటం సంతోషించదగ్గ పరిణామం అని, పిఆర్టియు సంఘ విధేయుడుగా ఉంటూ, సంఘ బలోపేతానికి కృషి చేస్తూ నేడు పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావటం నిజంగా శుభ పరిణామం అని తెలిపారు వైరా మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిమ్మ తోట జాన్ ఉద్యోగంలో నియామకమైనప్పటి నుండి పిఆర్టియు సంఘ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవరున్నా వారికి సహకరిస్తూ వారిని గౌరవిస్తూ,సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ఈ రోజున పిఆర్టియు రాష్ట్ర అత్యున్నత కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావడం నిజంగా శుభ పరిణామం అని తెలిపారు .ఈ సందర్భంగా పిఆర్టియు జిల్లా కార్యవర్గ సభ్యులు జి సుజాత, జి భారతి, కారుమంచి దయాకర్ రావు, పిఆర్టియు సీనియర్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, చిలుకూరి ఐజాక్, గూడపాటి శ్రీనివాసరావు,సూర్యదేవర సురేష్, ముజీబ్, శ్రీనివాసరెడ్డి, యాకోబ్, మండల కార్యవర్గ సభ్యులు పి.లత, నాగబత్తిని స్వప్న, అహల్య, ఎస్ సరస్వతి, జి గృహలక్ష్మి, జీ పద్మావతి, ఎన్ నాగరాణి, అమర్లపూడి రవికుమార్,అనుమోలు రాఘవరావు, తిరుమలయ్య, ఎం దయాకర్, జి.రమేష్, బి నాగరాజు, బి పుల్లారావు, ఎం ప్రభాకర్, హరిబాబు, రాగి.సురేష్, నజీర్, కిషన్, యాదగిరి, తాళ్ళూరి రవి తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం..

- ఇందుకోసం కాంగ్రెస్ శ్రేణులంతా కృషి చేయాలి...
- సత్తుపల్లి సన్నాహక సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పిలుపు..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

సత్తుపల్లి: ఖమ్మం – నల్లగొండ– వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు

ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

మూడు తరాలుగా కాంగ్రెస్ నేపథ్య నాయకుడు..

ఖమ్మం జిల్లాలో వెంకన్నగా, నల్గొండ జిల్లాలో దామన్నగా పేరుపొందిన నాయకుల సేవలు ప్రజలకు సుపరిచితమని ఎంపీ పేర్కొన్నారు. రాంరెడ్డి కుటుంబం కాంగ్రెస్ పార్టీకి చిరకాలంగా సేవలందిస్తోందని, ఆ కుటుంబం నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అని వివరించారు. పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలను శాసనమండలిలో సమర్థంగా ప్రస్తావించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని కోరారు. భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబరు 6వరకే ఉందని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఎంపీ సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులను గుర్తించి, ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ టన్నెల్ పనులపై ఖమ్మం ఎంపీ క్షేత్రస్థాయి పరిశీలన..

- బురదలో నడుస్తూ పురోగతిని పరిశీలించిన రఘురాం రెడ్డి



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్తుపల్లి మండలం యతాలకుంట గ్రామం వద్ద ప్రాజెక్టు టన్నెల్ ప్రాంతానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో కలిసి వెళ్లారు. బురదలో నడుస్తూ టన్నెల్ ప్రాంతానికి చేరుకున్న ఎంపీ.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టు పనుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు, పనులకు సంబంధించిన వివరాలను అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో..: అదనపు కలెక్టర్ , జిల్లా అటవీశాఖ అధికారి, కల్లూరు సబ్ కలెక్టర్, సర్పంచులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాలపాటి సాంబయ్య పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం..సీపీఎం

- అంజనాపురంలో పాలపాటి సాంబయ్య సంస్మరణ సభ..



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

తల్లాడ: సీపీఎం పార్టీకి, పేద ప్రజల హక్కుల

కోసం జరిగిన పోరాటాలకు పాలపాటి సాంబయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా నాయకులు కొనియాడారు. తల్లాడ మండలం అంజనాపురం గ్రామ శాఖ సీనియర్ సభ్యుడు పాలపాటి సాంబయ్య సంస్మరణ సభను సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారుఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు మాట్లాడుతూ.. పాలపాటి సాంబయ్య కుటుంబం పార్టీ అభివృద్ధికి, గ్రామంలో పార్టీని నిలబెట్టడానికి ఎనలేని కృషి చేసిందని గుర్తుచేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అచంచలమైన విశ్వాసంతో, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీని వీడకుండా ప్రజా ఉద్యమాల్లో సాంబయ్య చురుకుగా పాల్గొన్నారని తెలిపారు.తల్లాడ మండలంలో జరిగిన భూ పోరాటాలు, రైతాంగ పోరాటాలతో పాటు పేద ప్రజల హక్కుల సాధన కోసం నిర్వహించిన అనేక ఉద్యమాల్లో సాంబయ్య కీలకంగా పాల్గొని తన సేవలను అందించారని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.సాంబయ్య మరణించినప్పటికీ, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన భార్య సులోచన, కుమారులు గోపి, గోవర్ధన్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని నాయకులు ప్రశంసించారు. సాంబయ్య కుటుంబం నేటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తోందని తెలిపారు.పాలపాటి సాంబయ్య కుటుంబానికి సీపీఎం జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆశయాల సాధనకు, పేద ప్రజల సంక్షేమం కోసం పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సంస్మరణ సభలో సీపీఎం సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మాచర్ల భారతి, ఎర్ర శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, మారంపూడి పాండురంగారావు, చలమల్ల విటల్‌రావు, రావుల రాజాబాబు, కోలకపోగు సర్వేశ్వరరావు, సాయిని ప్రకాష్‌రావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, చల్లా నాగేశ్వరరావు, కళ్యాణపు కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

- పంచాయతీరాజ్ రాష్ట్రడిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 17: ఎల్సినో ప్రభావంతో ఏర్పడబోయే పరిస్థితులను తట్టుకోవడానికి నీటిని వృధా చేయకుండ ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమీషనర్ చం ద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణతో పాటు ఇళ్లల్లో నిర్మించుకుంటున్న ఇంకుడు గుంతలను,శివాలయం పక్కన భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న సామూహిక మరుగు దొడ్లను పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్ శనివారం సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ భాస్కర్, జిల్లా పం చాయతీ అధికారి వెంకటరెడ్డి, ఎంపీడీవో కావ్య, ఎస్బిఎం కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల లక్ష్య కాలేజీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు...



ఖమ్మం/ వైరా అక్టోబర్ 17(అక్షరం న్యూస్)

కొణిజర్ల: మండలం తనికెళ్ళ లక్ష్య కాలేజీలో ఐడి జెడ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా కాలేజీ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ వేడుకల్లో కంచర్ల ప్రియాంక, తుప్పతి రవికుమార్, సిరిపురపు శేషగిరిరావు, మల్లారపు నరేష్--అనూష, కె. సాయి తేజ, మోటే కీర్తి, చిందల పావని, ఎస్.కె. బాతుషా, అలేఖ్య, యాస బాలకృష్ణ, మేకల నరేష్, తుప్పతి వంశీకృష్ణ, సిరిపురపు రోహిత్, మందారపు రవీందర్, ఎం. వంశీ, లత, బైరు త్రివేణి, గురిజాల త్రివేణి, దుంపల కిషోర్--వసంత రాణి, గుడిపూడి జ్యోతి, మునగపాటి శేఖర్, కోరుమల్లి, పి. సునీత, కృష్ణారావు--గోపమ్మ, పాండవుల కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్



రామగిరి (పెద్దపల్లి జిల్లా) అక్టోబర్ 17 అక్షరం న్యూస్:

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలం లోని నాగేపల్లి గ్రామానికి చెందిన తాటి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం పరామర్శించారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్ సోదరుడైన శ్రీనివాస్ గౌడ్ మృతి పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం శ్రీనివాస్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును సన్మానించిన ఆలయ చైర్మన్



రామగిరి పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 17 అక్షరం న్యూస్

రామగిరి మండలం నాగేపల్లి వెంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి పునాది వేసింది మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకరే అని దేవాలయ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. శనివారం నాగేపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో నెలకొల్పిన దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర ఆలయం ఇక్కడ పురుడుపోసుకున్నదంటే దానికి ప్రధాన కారణం పుట్ట మధూకరే అని కొనియాడారు. ఆయన మొదట రూ. 8 లక్షలు మండపం నిర్మాణానికి కేటాయించడంతో గుడి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఆయన స్ఫూర్తితో నిర్మాణం మొదలు పెట్టి బీఆరెస్ హయాంలోనే నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అందరి సహకారంతో త్వరలోనే మిగతా పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవం చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం గుడి నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, ఆలయ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్ గౌడ్, గద్దల శంకర్ లతో పాటు బీఆరెస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్, మాజీ జడ్పీటీసీ మేదరబోయిన కుమార్ యాదవ్ లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేగోలపు రామాభాను నాయకులు కాపురవేన భాస్కర్, పుల్లెల కిరణ్, బుర్ర శంకర్ గౌడ్, ధర్మల రాజసంపత్, పాశం ఓదెలు, గండి సత్యనారాయణ గౌడ్, ఆసం తిరుపతి, వేగోలపు మల్లన్న, దామెర శ్రీనివాస్, బొంకూరి పోచమ్, కాట అనిల్, మహేందర్, దుద్దిల్ల రాజు, పోలు సంతు, వేగోలపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



రామగిరి (పెద్దపల్లి జిల్లా) అక్టోబర్ 17 అక్షరం న్యూస్:

రామగిరి మండలం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమపివిరావు శనివారం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు రత్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేశారు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సెంటినరీ కాలనీ సీ-2 క్వార్టర్ లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సెంటినరీకాలనీ ఎస్.టీ-2 జోన్-1 గ్రౌండ్ పక్కన ఏర్పాటుచేసిన దుర్గాదేవి పూజలు పాల్గొన్నారు. ఓసీపీ-1 భద్రకాళి టెంపుల్ లో పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు దుర్గాదేవి మండపాలలో నిర్వాహకులు సర్పంచ్ పల్లె ప్రతిమపివిరావు ని ఘనంగా సన్మానించారు.

పిట్టలదొర వేషంలో సామాజిక చైతన్యానికి రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకారం ..



ఖమ్మం/ వైరా అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

పిట్టలదొరగా ప్రభుత్వ ఉపాధ్యాయులు రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి పిట్టలదొర వేషం హాస్యంతో కూడిన మాటలు ఆలోచింపజేసే సందేశాలు ఇలా తనదైన శైలిలో ప్రజల్లో సామాజిక చైతన్యం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ సాధారణంగా వినోదాన్ని పంచే పిట్టలదొర వేషధారణకు సామాజిక బాధ్యతను జోడించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వాటి వల్ల కలిగే సామాజిక ఆర్థిక మానసిక శారీరక అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సందేశం ఇస్తున్నారు. అదే సమయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిస్తున్నారు అందరినీ నవ్విస్తూనే ఆలోచన చేస్తూ సాధారణంగా పిట్టలదొర దసరా పండుగ సందర్భంగా గ్రామాల్లో తన మాటల్లో గారడీతో నవ్వులు పోయిస్తూ ఎంతో కొంత యాచనచేస్తాడు కానీ ఇక్కడ మాత్రం డ్రగ్స్ గంజాయి నివారణ మరియు రోడ్డు భద్రతపై ఆలోచించే విధంగా శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోగల న్యూ బస్టాండ్ పరిసర ప్రాంతాలలో గంజాయి డ్రగ్స్ రోడ్డు భద్రత సందేశం మరియువినోదాత్మక వేషధారణతో ప్రజలను ఆకట్టుకుంటూ సామాజిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడమే ఈ ప్రయత్నంలోనే ప్రత్యేకత మాటల్లో హాస్యం ఉన్న సందేశంలో సామాజిక బాధ్యత కనిపిస్తుంది యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ ప్రచారం వెనకఉన్న ప్రధాన ఉద్దేశం అలానే మరుగున పడుతున్న జానపద కళలను కూడా వెలికి తీయడం తన వంతు బాధ్యతగా భావిస్తున్నాను

ఎన్టిపిసి ఏరియా లాడ్జిల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 17 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు లాడ్జిల్లో పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎన్టిపిసి ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో భాగంగా స్థానిక ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్స్‌లోని హోటల్ మయూర రెసిడెన్సీలో బస చేస్తున్న యువకుల వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. వివిధ లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించారు.లాడ్జిల్లో బస చేసే వ్యక్తుల గుర్తింపు వివరాలు, ఇతర సమాచారాన్ని పరిశీలిస్తూ తనిఖీలు చేపట్టారు. లాడ్జి నిర్వాహకుల నుంచి కూడా అవసరమైన వివరాలను సేకరించినట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించే లక్ష్యంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం.పోలీసుల తనిఖీలతో లాడ్జి నిర్వాహకులు, అక్కడ బస చేస్తున్న వారిలో అప్రమత్తత నెలకొంది.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ఐక్యతకు ప్రతీక బతుకమ్మ ..

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

ఖమ్మం/వైరా అక్టోబర్ 17 (అక్షరం న్యూస్)

తెలంగాణసంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మండలకాంగ్రెస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతులు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ. బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పండగ మాత్రమే కాదని తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రకృతి ఆరాధించే గొప్ప సాంస్కృతిక ప్రతీక అని పేర్కొన్నారు. ప్రాంగణంలో బంతి చామంతి గునుగు తంగేడు తదితరు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటి చుట్టూ మహిళలు మెప్మా ఆర్పి మహిళలు చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలంటూ సంప్రదాయ గీతాలు ఆలపించారు . తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు



ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను నూ వివరించారు. మహిళలందరూ సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రాందాస్ నాయక్ దంపతులు బతుకమ్మ వేడుకలో లయబద్ధంగా అడుగులు వేస్తూ కోలాటంతో ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ దంపతులు టి పి సి సి కార్యదర్శి కట్ల రంగారావు మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ పార్టీ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి వీరం శెట్టి నీతారాములు డిసిసి జిల్లా మెడికల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ లయన్స్ కంటి హస్పటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు 13వ వార్డ్ కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు , కౌన్సిలర్లు వేముల శ్రావణివుంద్రు వరలక్ష్మి పణి తి సైదులు తాటిపూడి సర్పంచి జవాజ అశ్విని మచ్చ బుజ్జి చెరుకూరి కిరణ్ మున్సిపల్ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని బతుకమ్మ పాటలు, ఆటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ఆకాంక్షించారు. బతుకమ్మలు సాగ నింపే కార్యక్రమంలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఓదెల రైల్వే స్టేషన్లో ఆల్టింగ్ ఇవ్వాలని ఆర్ కృష్ణయ్యకు వినతిపత్రం

పెద్దపల్లి ఓదెల అక్టోబర్ 17 అక్షరం న్యూస్

ఓదెల రైల్వే స్టేషన్ లో కొత్తగా ప్రవేశపెట్టిన రైళ్లు 07711 మరియు 07712 గల నెంబరు రైళ్లను ఓదెల రైల్వే స్టేషన్లో ఆల్టింగ్ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ను హైదరాబాద్ తన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చిన తాటికొండ కృష్ణమాచారి తాటికొండ వెంకటేశ్వర్లు

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓదెలలో అతిపెద్ద శైవ పుణ్యక్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం కలదని రైల్వే స్టేషన్ ఎన్ ఎస్ జి 4 కేటగిరి కలదని కొత్తగా ప్రవేశపెట్టిన 07711 మరియు 07712 నెంబర్ గల రైళ్లను ఓదెల స్టేషన్లో ఆల్టింగ్ ఇవ్వాలని 17035 మరియు 17036 గల అన్ని ఎక్స్ప్రెస్ రైళ్లు బల్లర్ష టు కాచిగూడ వరకు పొడిగించాలని ఈ రైల్లో నువ్వు రెగ్యులర్ చేసి 18 బోగీలు జనరల్ నడపాలని అన్నారు ఓదెల పుణ్యక్షేత్రం గ్రామ జనాభా 10 వేలు మండలం క్రింద రైల్వే స్టేషన్ నుండి 8 మండలాల ప్రజలు మరియు దేవస్థానం వచ్చే భక్తులు వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడికి దైవదర్శనానికి వస్తు పోతూ ఉంటారు అని ఇక్కడ నుండి సికింద్రాబాద్ వరంగల్ విజయవాడ బల్లర్ష కాచిగూడ కు ప్రయాణం చేస్తారన్నారు ఈ నూతన ట్రైన్లు దసరా స్పెషల్ గా నడుపుతున్నారని మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరుతుందని ఈ రైలు కు జనం విపరీతంగా ఉండటం వల్ల ఓదెల రైల్వే స్టేషన్లో స్టాప్ ఇవ్వలేదు అని అని అన్నారు ఓదెల రైల్వే స్టేషన్ ఆలయం సంవత్సరానికి 60 లక్షలు పుణ్యక్షేత్రం ఎన్ఎస్6 . ఫోర్ స్పెషల్ ట్రైన్ ఈ రైలు ఓదెల రైల్వే స్టేషన్లో స్టాప్ ఇవ్వాలని కోరడం జరిగిందని అన్నారు అదేవిధంగా వదల రైల్వే స్టేషన్లో పెద్దపల్లి లాంటి బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మించాలని కాజీపేట బల్లార్షా సెక్షన్



అభివృద్ధికి సౌత్ సెంట్రల్ రైల్వే నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు కావున తమరు ద్వారా రైల్వే మినిస్టర్ అశ్విని వైష్ణవి తో చర్చలు జరిపి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే స్టేషన్లో స్పెషల్ రైలు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని పేర్కొన్నారు కార్యక్రమంలో

పెద్దపల్లిలో వైభవంగా దసరా వేడుకల నిర్వాహణ

- 35 అడుగుల రావణ దహనానికి ముస్తాబు
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు
- కుటుంబ సమేతంగా తరలిరావాలని ప్రజలకు ఆహ్వానం



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 17 అక్షరం న్యూస్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా ఉత్సవాలను పెద్దపల్లి పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఈ నెల 20వ తేదీ మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ ఉత్సవాల ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ప్రజలందరికీ గుర్తుండిపోయేలా ఈ ప్రత్యేక వేడుకలను ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు సాంప్రదాయబద్ధంగా జమ్మి పూజ, అనంతరం సాయంత్రం 6:00 గంటలకు బాణాసంచా వెలుగుల మధ్య అట్టహాసంగా 35 అడుగుల ఎత్తైన రావణాసురుడి దహన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. పట్టణ ప్రజలందరూ కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, పట్టణ కౌన్సిలర్లు, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ రాజశేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాపకాల వెల్లువలో హైకూ



ఏగన్, 'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహించారు. డి.అరుళానందు, మాధ్యూ అరుళానందు నిర్మాతలు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరులో సమావేశంలో కథానాయిక శ్రీదేవి మాట్లాడుతూ..తన హృదయానికి ఎంతో దగ్గరైన చిత్రమిదని, ప్రేమలోని సంఘర్షణ, మధుర జ్ఞాపకాలను ఆవిష్కరిస్తుందని చెప్పింది. నిజాయతీతో కూడిన ప్రేమకథ ఇదని, కాలేజీ జీవితంలోని అందమైన అనుభవాల్ని చూపించారని కోన వెంకట్ తెలిపారు. తమిళంలో మాదిరిగానే తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉందని హీరో ఏగెన్ పేర్కొన్నారు.

విద్యుత్ సాగునీటి సమస్యలను పరిష్కరించాలి

- రాఘవపూర్ సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 17 అక్షరం న్యూస్

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు, రైతులు పెద్దపల్లి మండలం రాఘవపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర శాఖ, కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ, పెద్దపల్లి జిల్లా శాఖ పిలుపు మేరకు శనివారం ఉదయం నిర్వహించిన ఈ ధర్నాలో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తరచూ విద్యుత్ కోతలు విధించడంతో వ్యవసాయ మోటార్ల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యుత్ సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు తగిన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని ముందుగానే విడుదల చేసి ఉంటే రైతులకు ప్రయోజనం కలిగేదని, నీటిని సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కట్కూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, విద్యుత్ కోతల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్, సాగునీరు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తూకం పేరుతో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో రైస్ మిల్లులపై అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా, సాగునీరు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిరంతర విద్యుత్ సరఫరా, సకాలంలో సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్, యువ మోర్చా అధ్యక్షులు రామగిరి అఖిల్, కందుల శ్రీనివాస్, కల్లేపల్లి అంజి, వేణు, కుమార్,అన్వేష్ తదితరులు పాల్గొన్నారు

దావన్నపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్
- ఏఐఎఫ్‌బీ పార్టీలో చేరిన వార్డు సభ్యులు



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 17 అక్షరం న్యూస్

దావన్నపల్లి గ్రామం ఐకమత్యానికి నిలువెత్తు ప్రతీక అని,రానున్నది బీసీల రాజ్యమేనని,ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఎల్లప్పుడూ మీ ముందుండి నిలబడతానని ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ఉద్ఘాటించారు.తనపై అపారమైన నమ్మకంతో ఇంతటి ప్రేమాభిమానాలను కురిపిస్తున్న దావన్నపల్లి గ్రామాన్ని జిల్లాలోనే అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధి దిశగా తనతో కలిసి నడవాలని ఆయన గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.శనివారం గ్రామానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు,కీలక నాయకులు, గ్రామస్తులు ముక్తకంఠంతో కొలిపాక శ్రీనివాస్ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.రానున్న 2028 శాసనసభ ఎన్నికల్లో కొలిపాక శ్రీనన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే లక్ష్యంగా,గ్రామం మొత్తం ఆయన వెంటే నిలుస్తుందని స్పష్టం చేస్తూ భారీ ఎత్తున ఏఐఎఫ్‌బీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వార్డు సభ్యులు ఆసంపల్లి రామ్మోహన్,లక్ష్మి-రమేష్,దొడ్ల రిషిత-సతీష్,సర్పంచ్ అభ్యర్థి దొడ్ల రామకృష్ణ,దావన్నపల్లి ఆలయ చైర్మన్ మద్దెల మల్లయ్యలతో పాటు గ్రామ పెద్దమనుషులు, యువకులు, మహిళలు కొలిపాక శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి,ప్రజా సంక్షేమానికి శ్రీనివాస్ నాయకత్వమే సరైన మార్గమని ఈ సందర్భంగా చేరిన నాయకులు స్పష్టం చేశారు

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- 10.30 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు భూమిపూజ



మద్దూర్ / అక్టోబర్ 16 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం, వ్యవసాయ పనులకు విద్యుత్ అంతరాయాల వల్ల ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యంగా జుక్కల్ నియోజకవర్గంలో కీలక ముందడుగు పడింది. బ్రాహ్మణ్‌పల్లి--ఆరేపల్లి, కాటేపల్లి, లచ్చన్, తడ్గూర్ గ్రామాల్లో మొత్తం రూ. 10.30 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు భూమిపూజ చేశారు.విద్యుత్ సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులువ్యవసాయ రంగానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని భావించిన ప్రభుత్వం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ఈ నిర్మాణాలను చేపడుతోంది. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో ఆయా గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ అవసరాలు తీర్చడంతో పాటు, లోడ్ సమస్యలు, సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు ఈ సబ్‌స్టేషన్లు దోహదపడనున్నాయి.మూడు నుంచి నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలిసబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మూడు నుంచి నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులుఈ భూమిపూజ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక పార్టీ కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.గ్రామీణ విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసి, రైతులకు సాగు సమయంలో విద్యుత్ పరమైన ఇబ్బందులు తగ్గించేందుకు ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణం కీలకంగా మారనుంది. నిర్ణీత గడువులో పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు, ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ఐక్యతకు ప్రతీక బతుకమ్మ..

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

ఖమ్మం/వైరా అక్టోబర్ 16 (అక్షరం న్యూస్)

తెలంగాణసంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మండలకాంగ్రెస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. బతుకమ్మ వేడుకల్లో

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతులు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ. బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పండగ మాత్రమే కాదని తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రకృతి ఆరాధించే గొప్ప సాంస్కృతిక ప్రతీక అని పేర్కొన్నారు. ప్రాంగణంలో బంతి చామంతి గునుగు తంగేడు తదితరు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటి చుట్టూ మహిళలు మెప్మా ఆర్పి మహిళలు చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలంటూ సంప్రదాయ గీతాలు ఆలపించారు . తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను నూ వివరించారు. మహిళలందరూ సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రాందాస్ నాయక్ దంపతులు బతుకమ్మ వేడుకలో లయబద్ధంగా అడుగులు వేస్తూ కోలాటంతో ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ దంపతులు టి పి సి సి కార్యదర్శి కట్ల రంగారావు మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ పార్టీ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి వీరం శెట్టి సీతారాములు డిసిసి జిల్లా మెడికల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ లయన్స్ కంటి హస్పటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు 13వ వార్డ్ కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు ,



కౌన్సిలర్లు వేముల శ్రావణివుంద్రు వరలక్ష్మి పణి తి సైదులు తాటిపూడి సర్పంచి జవాజ అశ్విని మచ్చ బుజ్జి చెరుకూరి కిరణ్ మున్సిపల్ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని బతుకమ్మ పాటలు, ఆటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ఆకాంక్షించారు బతుకమ్మలు సాగ నింపే కార్యక్రమంలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

యాంటీ బయోటిక్స్‌కు లొంగని బ్యాక్టీరియాను

సైతం నాశనం చేసే వైరస్.. సైంటిస్టుల పరిశోధన..

యాంటీబయాటిక్ మందులకు లొంగని బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు మరింత సమర్థవంతమైన చికిత్సలను అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు కీలకమైన కొత్త విషయాన్ని కనుగొన్నారు. బ్యాక్టీరియాపై దాడి చేసే వైరస్‌లు తమలోని రక్షణ వ్యవస్థను ఎలా అప్రమత్తం చేస్తున్నాయో తాజా పరిశోధన వెల్లడించింది. బ్యాక్టీరియాను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని నాశనం చేసే బ్యాక్టీరియోఫేజ్ వైరస్‌లను ఉపయోగించే చికిత్సా విధానాన్ని ఫేజ్ థెరపీ అంటారు. ఈ విధానం ద్వారా హానికరమైన బ్యాక్టీరియాను నాశనం చేయవచ్చు. అయితే, వైరస్‌ల దాడిని ఎదుర్కొనేందుకు బ్యాక్టీరియాకు కూడా సొంత రోగనిరోధక వ్యవస్థలు ఉండడంతో చికిత్సలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ రక్షణ వ్యవస్థల పనితీరును అర్థం చేసుకోవడం ద్వారా మెరుగైన చికిత్సలను రూపొందించవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

బ్యాక్టీరియాలో ఉండే కీలక వ్యవస్థ..

ఈ అధ్యయనం బ్యాక్టీరియాలోని సీబీఏఎస్ఎన్ (జదీూూూ) అనే రోగనిరోధక వ్యవస్థపై దృష్టి సారించింది. వైరస్ దాడి జరిగినప్పుడు ఈ వ్యవస్థ అప్రమత్తమై, అవసరమైతే సోకిన బ్యాక్టీరియా కణం తనను తాను నాశనం చేసుకునేలా చేస్తుంది. దీనివల్ల వైరస్ ఇతర సమీప కణాలకు వ్యాపించే అవకాశాన్ని అడ్డుకోవచ్చు. అయితే, ఈ ప్రక్రియలో బ్యాక్టీరియా కణమే నశిస్తుంది కాబట్టి నిజమైన వైరస్ ముప్పును గుర్తించినప్పుడే ఈ వ్యవస్థ పనిచేయడం అత్యంత కీలకం. వైరస్ ఉత్పత్తి చేసే ప్రోటీజ్ అనే ఎంజైమ్ బ్యాక్టీరియా కణంలోని ఒక ముఖ్యమైన గుర్తింపు ప్రోటీన్‌ను విచ్ఛిన్నం చేస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ మార్పే హెచ్చరిక సంకేతంగా పనిచేసి, రోగనిరోధక ప్రతిస్పందనను ప్రారంభిస్తుంది.

బ్యాక్టీరియాలోని ప్రోటీన్‌పై ప్రభావం..

ఇప్పటివరకు తెలిసిన కొన్ని రోగనిరోధక వ్యవస్థలు వైరస్ జన్యు పదార్థాన్ని నేరుగా గుర్తించి స్పందిస్తాయి. కానీ సీబీఏఎస్ఎన్ వ్యవస్థలో మాత్రం వైరస్ ఉత్పత్తి చేసిన ఎంజైమ్ బ్యాక్టీరియాలోని ప్రోటీన్‌పై చూపే ప్రభావమే రక్షణ చర్యను ప్రారంభించే సంకేతంగా పనిచేస్తుంది. వైరస్ తనకు అవసరమైన ప్రక్రియలో భాగంగా ఉత్పత్తి చేసే ఎంజైమ్‌నే బ్యాక్టీరియా తన రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసేందుకు ఉపయోగించుకోవడం ఈ పరిశోధనలో గుర్తించిన ప్రధాన అంశం. ఈ విధానం గురించి తెలుసుకోవడం వల్ల బ్యాక్టీరియా వైరస్‌లను ఎలా గుర్తిస్తుంది, వాటి దాడిని ఎలా ఎదుర్కొంటుంది అనే విషయాలపై మరింత స్పష్టత లభిస్తుంది. ఈ పరిశోధన ఫలితాలు సైన్స్ అనే శాస్త్రీయ పత్రికలో ప్రచురితమయ్యాయి.

ఫేజ్ థెరపీకి మార్గం సులభతరం..

ఈ ఆవిష్కరణ యాంటీబయాటిక్ నిరోధక బ్యాక్టీరియాపై



ఫేజ్ థెరపీని మరింత ప్రభావవంతంగా అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అవకాశం ఉంది. బ్యాక్టీరియా రక్షణ వ్యవస్థలను అధిగమించగల వైరస్‌లను రూపొందించడానికి పరిశోధకులకు ఇది మార్గనిర్దేశం చేస్తుంది. అలాగే సీబీఏఎస్ఎన్ వ్యవస్థకు మనుషుల్లో కనిపించే కొన్ని రోగనిరోధక ప్రక్రియలతో సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. బ్యాక్టీరియా, మానవుల్లోని ఈ వ్యవస్థల మధ్య ఉన్న పోలికలు, వైరస్‌లను ఎదుర్కొనే కొన్ని ప్రాథమిక రక్షణ విధానాలు కోట్లాది సంవత్సరాల పరిణామ క్రమంలోనూ కొనసాగి ఉంటాయని సూచిస్తున్నాయి. బ్యాక్టీరియాపై వేగంగా ప్రయోగాలు చేసి తెలుసుకున్న విషయాలను మరింత సంక్లిష్టమైన జీవవ్యవస్థల్లో పరిశీలించేందుకు కూడా ఈ పరిశోధన తోడ్పడుతుందని పరిశోధకులు తెలియజేస్తున్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 17: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఎం పీడీవో కావ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కావ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ సంబరాలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించడం అమితానందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రియాంక, సౌజన్య, నర్మద, మౌనిక,



కవిత, యాదమ్మ, వీబీజీ రామ్ జీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు,దివ్యాంగులకు చేతి కర్రలు,బెడ్‌షీట్ల పంపిణీ

జఫర్ గడ్,అక్టోబర్17, అక్షరంన్యూస్:జఫర్ గడ్ మండలంలోని తిడుగు గ్రామంలో వృద్ధులు, దివ్యాంగులకు చేయూత నందించే ఉద్దేశంతో చేతి కర్రలు,బెడ్‌షీట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తిడుగు గ్రామ కంటెస్టెంట్ సర్పంచ్ నల్లతీగల శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల పట్ల మన మందరం మానవత్వంతో బాధ్యతతో వ్యవ హరించాలని నిర్వాహకులు పేర్కొన్నారు సమాజంలో అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువతఎగ్రామ పెద్ద మనుషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపడంతో



పాటు, ఐక్యత మరియు మానవత్వపు విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ఆకాశం హద్దులు దాటి..

అలాంటి సమయంలో కృష్ణ అనే వ్యక్తి ఆమెకు అండగా నిలుస్తాడు. కల్పన కలల సాకారానికి భరోసాగా ఉంటాడు. ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే ఓ అమ్మాయి ఎలాంటి విజయాలు సాధిస్తుందో నిరూపిస్తాడు. మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసం చాటిచెప్పే ఇలాంటి కథతో తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ సాధినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు.శనివారం టీజర్‌ను విడుదల చేశారు. గ్రామం పరిధులు దాటలేని ఓ అమ్మాయి ఆకాశమే హద్దుగా తన కలల్ని సాకారం చేసుకునే వైనాన్ని ఆవిష్కరిస్తూ టీజర్ ఆద్యంతం స్ఫూర్తివంతంగా, భావోద్వేగాలతో సాగింది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. శృతిహాసన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సమర్పణ: గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, రచన: గంగరాజు గుణ్ణం, దర్శకత్వం: పవన్ సాధినేని.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609